


# వేట

## వేదగిరి

రెండు రోజులుగా భరిస్తూన్న ఆకలి తాలూకు నీరసం ఆమెను నిలవనీయనంటూంది. కాళ్ళు వణక సాగాయి. కడుపులో మంట మరింత కాసాగింది. అయినా తప్పదీ నిరీక్షణ. నెమ్మదిగా తలుపుకు చేరగిలబడి నిలబడింది. ఆ వీధిలోకి ఎవరైనా వస్తున్నారేమోనన్న ఆశతో ఆమె చూపులు మాత్రం అటూ ఇటూ పరుగెత్తసాగాయి

ఆమె పేరు సీత. పురాణంలో సీతకి ఈ సీతకి పేరులో తప్ప మరెక్కడా సంబంధం లేదు. ఈ సీత తండ్రి ఓ

చిరుద్యోగి. పైగా సంతానంలో కుచేలుడి తమ్ముడు. అందరిలోకి పెద్దపిల్ల సీత తన తండ్రి ఎలాగూ పెళ్ళిచెయ్యలేడని నిర్ధారణ చేసుకుని ఓ అభినవ రాముణ్ణి నమ్ముకుని ఓ రాత్రి ఆ రాముడితో పుడాయించింది.

వాళ్ళ కొత్తకాపురం నెలరోజులు సాఫీగానే సాగింది. ఆ నెలరోజులూ తామిద్దరూ సీతారాములమని, తమకి లవకుశల్లాంటి ఇద్దరు పిల్లలు చాలని, ఇంకా ఎన్నో కలలు కంది. ఆ కలలన్నీ కల్లలే అయ్యాయి.

అభినవరాముడు పెద్ద వెరైటీ పక్షి. అన్ని అలవాట్లూ అతని సొత్తే! ఆ అలవాట్లు నిర్విఘ్నంగా కొనసాగటానికి అతను ప్రాణాలు కూడా ఇస్తాడు. అందుకు సాక్ష్యం సీత శీలాన్ని మార్కెట్టులో పెట్టడానికి కూడా వెనుకీయక పోవడమే!

ఉన్నట్టుండి ఓరోజు అభినవరాముడు సీతను వంటరిగా వదిలిపెట్టి ఎటో వన వాసం వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇంత వరకూ అతని జాడే లేదు. అతను బల వంతాన చూపిన బాటే చివరికి సీతకి జీవన బాటయింది. నాటినుంచీ ఏ విలాస పురుషుడైనా కులాసా కోసం గదిలో కాలుపెడితేనే ఆ రోజు ఆమె ఉదరం నిండేది.

ఆ సందులో ఎక్కడా జనసంచారం లేదు. ఎవ్వరూ వస్తున్న జాడకూడా లేదు.

"ఏ రోజుకారోజు గడవటమే కష్టంగా వుంటే మామూళ్లు! పోలీసు పాపయ్యకి. తన మామూళ్ళు సరిగా ఇవ్వడంలేదని టోపీవరకూ కోపం వుంది. కొంపతీసి అసలేచస్తుంటే ఇప్పు డొచ్చి పడడు గదా! భగవాన్! అంతా నీదయ!" సీత మనసు బాధతో మూల్గింది

అప్రయత్నంగా ఆ సందు చివరివేపు తిరిగిన ఆమె కళ్ళలో వింత మెరుపు మెరిసింది. అటుగా వస్తూ ఓ యువకుడు కన్పించాడు సీత దృష్టి ఆత్రంగా ఓసారి ఆ సందులోని ఇళ్ళన్నిటి వేపు ప్రసరించింది. అందరూ నిద్రపోతు న్నారు. తనొక్కర్తే మెలకువగా వుంది. భగవంతుని దయవల్ల ఈ ఒక్క బేరం తగిలేచాలు!

అతని పేరు రవీంద్ర. ప్రతిరోజూ ఆసందుగుండా టీకి వెళ్ళడం అతనికి అలవాటు. అలవాటు అనడంకన్నా హాబీ అంటే బాగుంటుందేమో! దాదాపు మూడు సంవత్సరాల నుంచీ అతను రాత్రిపూట ఆసందుగుండానే టీకివెళ్తుం టాడు మామూలుగా. అతనికి పక్కన మనుషులుండందే బాగుండదు, కాని టీకివెళ్ళేప్పుడు సాధ్యమైనంతవరకూ వంటరిగానే వెళ్తుంటాడు. అలా వంటరిగా పోతూ. విటులకోసం కళ్ళలో కొవ్వొత్తులు వేసుకుని విటులకోసం నిరీక్షించే పడతులను పరీక్షించివీక్షించ

దమంటే మంచి సరదా అందుకోసమే అతను రాత్రిళ్ళు అలా వెళ్తుంటాడేమో కూడా!

కాని ఇవాళ అతని మనస్సు ఇక్కడెక్కడా లేదు. రేపే ఆర్గానిక్ కెమిస్ట్రీ పరీక్ష. దాన్ని కాస్తా దాటేశాడంటే డిగ్రీ చేతికొచ్చినట్లే! తరువాత తీరిగ్గా ఉద్యోగాల వేటలో పడొచ్చు. ఇంత వరకూ పదికి పైగా స్లిప్పులు తయారు చేశాడు అయినా భయంగానే వుంది. ఖర్మకాలి వాటిలో ఒక్క ప్రశ్న రాకుంటే? అమ్మో! గబగబా టీ తాగి వెళ్ళి మరో అయిదు ప్రశ్నల కన్నా స్లిప్‌లు తయారు చెయ్యాలి.

ఎంతసేపూ అతని ఆలోచనలు రేపు జరగబోయే పరీక్ష చుట్టూనే పరి పరి విధాలా పయనించ సాగాయి.

"ఈకుర్రాడు రోజూ ఈ సందుగుండా పోతూ వుంటాడు. కాని, ఏ ఇంట్లోకి వెళ్ళినట్లు ఎప్పుడూ చూడలేదు. ఇటు వేపే వస్తున్నాడే! ఏమో! కుర్రాడికి ఇటు వేపు గాలి మళ్లిందేమో!' ఆలోచిస్తూ రోడ్డు పక్కకొచ్చి అతడ్ని చూసి ఆమె మనసు ఆనందంలో తేలియాడ సాగింది.

అప్రయత్నంగా పక్కకి తిరిగిన అతని కళ్ళకి ఆమె కళ్లలోని వింత మెరుపు కనిపించింది. రవీంద్రకి చిలిపి ఆలోచన కల్గింది. ఆ అమ్మాయి ఆశగా తనవేపే చూస్తోంది. ఆమెకి మరింత ఆశ కల్గేటట్లు దగ్గరగా వెళ్ళి. వెళ్ళి పోవాలి.

'అరె! నిజంగా యిటే వస్తున్నాడే!' సీత మనసు ఆనందంతో పురకలు వేయ సాగింది. బహుశా లాటరీలో లక్షరూపాయలు వచ్చినవాడికూడా అంత ఆనందము కలగదేమో! అమ్మయ్య! ఈ బేరం తగిలిందంటే రేపు రెండుపూటలా భోంచేయవచ్చు.' తనలోతనే తలపోస్తూ సందు రెండో వేపు తిరిగింది.

ఆమె గుండె గుభేల్‌మంది. సైకిల్ మీదవస్తూ పోలీసు పాపయ్య కన్పించాడు. ఎవరో తలమీద రోకలితో గట్టిగా కొట్టినట్లనిపించింది. కళ్లు తిరగ సాగాయి. బలవంతాన తమాయించుకుని గభాలున లోపలికిపోయి, దభాలున తలుపు బిగించింది. అలాగే కన్నీళ్లు కారుస్తూ మంచంమీద వాలిపోయింది.

సీత లోపలికి పరుగెత్తి తలుపు గడేసుకోవడం పాపయ్య కంటపడనే పడింది. అసలే అతని మనసు చిరాగ్గా వుంది. దానికి తోడు సీత ప్రవర్తన చూడగానే అగ్నికి ఆజ్యంపోసినట్లయింది.

'పెద్దాడికి ఎల్లుండే ఇంటర్వ్యూ. కనీసం రేపన్నా వాడు వెడితేగాని వీలు పడదు. వెళ్ళాలంటే కనీసం పదిహేను రూపాయలైనా కావాలి. నెలాఖరు రోజులు పది రూపాయలు సంపాదించే సరికే తలప్రాణం తోక కొచ్చింది. ఇంకా అయిదు రూపాయలు

కావాలి. సీత ముండ ఇవ్వాళైనా ఇవ్వకపోతుందా అనుకున్నాను కాని, దాని ప్రవర్తన చూసిన తరువాత ఆ ఆశ పూర్తిగా అడుగంటి పోయింది. ఏమైనా ఎట్లాగైనా ఈ రాత్రికి మిగతా అయిదురూపాయలు కూడా సంపాదించి తీరాలి.' మనసులోనే గట్టిగా శపథం చేసుకున్నాడు పాపయ్య సర్కార్.

సంపాదన మార్గాన్వేషణలో అతని మనసు పరిపరివిధాల పరుగెత్తసాగింది. ఎదురుగా వస్తున్న రవీంద్రని చూడగానే పాపయ్య మనసు పాదరసంలా పనిచేసి, ఓ మెరుపు మెరిసింది.

"ఏయ్! ఎవరునువ్వు?" పాపయ్య నిలవేశాడు రవీంద్రని. "నా పేరు రవీంద్రండి. బి. యస్ సి. చదువుతున్నాను."

"అర్ధరాత్రిపూట ఇలా ఎక్కడికి వెలున్నావ్?"

"టీకి వెళ్తున్నానండి."

"నాన్సెన్స్. అబద్ధాలాడకు. నువ్వా ఇంట్లోంచి వస్తూంటే చూశాను." సీత ఇంటివేపు చూపించాడు. రవీంద్రుడి గుండెల్లో రైళ్ళు గుద్దుకున్నాయి.

"అదేమిటండీ! నేను పైనుంచీ వస్తున్నట్లు చూసి కూడా అలా అంటున్నారు!" ఈ జవాబు పాపయ్యలో కొంత కలవరాన్ని రేపింది. అయినా వెంటనే సర్దుకున్నాడు. అతని సర్వీసులో కొద్దో గొప్పో మార్పులతో ఇటువంటి సంఘటనల నెన్నిటినో చూశాడు. గొంతును హెచ్చించాడు.

"రేయ్! కాలేజీకుర్రాడినంటున్నావ్! అసలు ఈ సందులో నీకేం పని? పైగా నన్నే దబాయిస్తావ్? పద ముందు స్టేషన్‌కి." పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం బాగానే పనిచేసింది. రవీంద్ర గుండెలు మరింతగా గుబగుబలాడాయి. మామూలు రోజుల్లో అయితే వాడికి తగిన బుద్ధే చెప్పేవాడు. కాని ఇవి పరీక్ష రోజులు. తెల్లవార్లూ మేలుకుంటేగాని ఒక దోవకి వచ్చేలా లేదు. ఇప్పుడు వాడు స్టేషన్‌కి నడవమంటే పరీక్ష కాస్తా గోవిందా! ఇన్నాళ్ళ శ్రమ వృధాయే అవుతుంది. ఎలాగైనా వాడ్ని వదిలించుకోవాలి. వెంటనే రవీంద్ర చెయ్యి జేబులోకి పోయింది. రూపాయి తీసి పాపయ్య చేతిలో పెట్టాడు.

"నిజంగా నన్ను నమ్మండి. పరీక్ష రోజులు అందుకని చదువుకుంటూ నిద్దరొస్తే టీకి బయల్దేరాను. ఈ ఒక్కసారికి నన్ను విడిచిపెట్టు. మళ్ళీఎప్పుడూ ఇటు రాను." తప్పదు గనుక ప్రాధేయపడసాగాడు.

"ఎవరిక్కావాలయ్యా నీ బోడి రూపాయి! పద ముందు స్టేషన్‌కి." ఎలాగైనా అయిదు రూపాయలూ వాడి దగ్గర్నుంచే వసూలు చేయాలనే పట్టుదల అధికమైంది పాపయ్యలో.

"ప్లీజ్ సర్ ఇవిగో మొత్తం నా దగ్గర మూడు రూపాయలున్నాయి. వీటితో ఇంకా మూడు రోజులు గడపాలి. రేపు పరీక్షుంది. వీటిని తీసుకుని దయచేసి నన్ను విడిచిపెట్టండి" రవీంద్ర కంఠం జీరపోయింది.

వాడినా పరిస్థితిలో చూసేసరికి పాపయ్యలో కొంచెం చలనం కలిగింది. అట్టడుగున ఎక్కడో పడుకున్న మాన

త్వం కొద్దిగా కదిలింది.

"సరే. ఈ సారికి వెళ్ళు. మళ్ళీ ఎప్పుడూ ఇటు రాకు." మూడు రూపాయలూ స్వాతంత్ర్యాన్ని పొంది పాపయ్య జేబుని చేరుకున్నాయి.

'బ్రతుకు జీవుడా!' అనుకుంటూ, టీ సంగతి మర్చిపోయి, వెనక్కి తిరిగాడు రవీంద్ర.

"ఎలాగైనా ఈ రాత్రికి మిగతా రెండు రూపాయల్నికూడా సంపాదించాలి" అని అనుకుంటూ సైకిల్‌స్టాండ్ వేసి సీత గుమ్మం మెట్లెక్కసాగాడు పాపయ్య.

పాపయ్య మెట్లమీదవేసే ఒక్కొక్క అడుగూ సీతకి గుండెలమీద వేస్తున్నట్లే అన్పించసాగింది. "భగవాన్! అంతా నీదయ!" దేవుడిమీద భారంవేసి కళ్ళు గట్టిగా మూసుకుంది .... అయ్యా! ఇదీ కథ — అంటూ ముగించాడు ముకుందం.

"ఆ తర్వాత?" ఆత్రంగా అడిగాడు అరవిందం.

"అంతే! అయిపోయింది." సిగరెట్టుని వెలిగించి పొగని రింగులు రింగులుగా వదల్తూ, వాటివేపే చూస్తూ అన్నాడు ముకుందం.

"అదేంటి గురూ! కథని మధ్యలో ఆపేసి అయిపోయిందంటావ్?" అయోమయంగా అడిగాడు సత్యానందం.

ముకుందం ముక్కు కోపంతో ఎర్రబడింది. "కథయి పోయిం దంటుంటే మధ్యలో ఆపేశా.... మధ్యలో ఆపేశానంటే ..."

"ఇంతకీ నీ కథ పేరేమిటి పెట్టావు గురూ?" ముకుందం మాటలకి మధ్యలో అడ్డుపడుతూ అడిగాడు అరవిందం.

"వేట" సిగరెట్టు దమ్ము గట్టిగాలాగి విలాసంగా జవాబిచ్చాడు ముకుందం.

"వేటా?!" అదేం పేరు గురూ?" శిష్యులిద్దరూ ఒకేసారి కోరస్ పలికారు.

"నా వుద్దేశంలో జీవిత మంటేనే ఓ వేట. అభినవ రాముడి వేటలో సీత పడింది. సీత తన బ్రతుకు తెరువు కోసం యవ్వన మనే వలల్ని విసిరి విటుల్ని వేటాడుతూంటుంది. పాపయ్యలాంటివాళ్ళు అధికారమనే వలల్ని విసిరి సీత లాంటి అభాగినుల్ని వేటాడుతుంటారు. వాళ్ళని వాళ్ళ పై ఆఫీసర్లు .... వాళ్ళని వాళ్ళ పై ఆఫీసర్లు .... ఇలా ఒకళ్ళనొకళ్ళు వేటాడుతూనే వుంటారు. ప్రేమ,బాంధవ్యంలాంటివిగూడా వేటాడడాన్కి బాగా ఉపయోగపడే కొన్ని రంగుల వలలు. అది సరేగాని అరవిందం! అర్జంటుగా ఓ అయిదు రూపాయలుంటే అప్పియ్యి. మళ్ళీ ఫస్ట్ కిచ్చేస్తాలే!"

"సారీగురూ! నాకూ అర్జంటుగా ఓ ఐదు రూపాయలు కావాలి. కథని చెప్పటం పూర్తవగానే నిన్నే అడుగుదామనుకుంటున్నా. సత్యానందాన్ని అడిగితే తనదగ్గర అయిదు పైసలున్నాయన్నాడు."

"సరే! లేవండి. బాగా పొద్దుపోయింది. ఇవాళ ఎవర్నైనా అడిగి అయిదు రూపాయలు సంపాదించిగాని ఇంటికి జేరను, జేరలేను."

ముగ్గురూ పార్కులోంచి బయటికి బయల్దేరారు. ●